## క్లుప్తంగా

### పెండింగ్ జీతాలు చెల్లించాలి..



సమావేశంలోమాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగారావు

**విజయనగరం ఫూల్‌బాగ్:** పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. జోగారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమర్‌భవన్‌లో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకూడదన్నారు. ఖాళీగా ఉన్న 3500 ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ వి. గోవిందరావు, జిల్లా నాయకులు డి. శ్యామ్, చిప్పాడ సూరిబాబు, ఎంఎ స్వామి, ఎం. మురళి, జి. రవి, పి. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

### సేవలోనే సంతృప్తి



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న శేఖర్ యాదవ్, తదితరులు

**విజయనగరం టౌన్:** నిర్భాగ్యులకు సేవలందించడంలోనే సంతృప్తి ఉంటుందని యాదవ హక్కుల పోరాట సమితి ఏపీ అధ్యక్షుడు ఇసరపు శేఖర్‌యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ సెయింట్ మేరీస్ స్కూల్ సమీపంలో ఉన్న లిటిల్ చిల్డ్రన్స్ హోమ్‌లో ఆదివారం అన్నదానం నిర్వహించారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మన్యాల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, మన్యాల ఏళ్ల తరబడి సేవలందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బోణి అప్పారావు, రాజు రామకృష్ణ , ముద్దాడ నారాయణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా విశ్వమానవ సౌభ్రాతృత్వ దినోత్సవం



వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న స్వామి

**నెల్లిమర్ల:** మండల కేంద్రంలో విశ్వమానవ సౌభ్రాతృత్వ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ జంక్షన్‌లో గల వివేకానంద విగ్రహానికి రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు స్వామి అర్చనానంద మహరాజ్, తిరుమలరాజు జగన్నాథరాజు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, చికాగో నగరంలో 130 ఏళ్ల కిందట నిర్వహించిన ప్రపంచ ఆధ్యాత్మిక సభలో వివేకానంద స్వామి ప్రసంగించారని గుర్తుచేశారు. వివేకానంద ప్రసంగానికి 130 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లిమర్లలో బాలవికాస కేంద్రం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..



కలెక్టరేట్ వద్ద వేడుకోలు దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగులు

**విజయనగరం ఫూల్‌బాగ్:** సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. కాంతారావు, సీఆర్‌ఎంటీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గురువులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద వేడుకోలు దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలన్నారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైమ్ విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైమ్ కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాన్నారు. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఆర్‌కే ఈశ్వరరావు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి. అప్పలసూరి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏ. లక్ష్మునాయుడు, ఆర్. శ్రీనివాసరావు, బి. రవీంద్ర, ప్రమీల, పోలినాయుడు, గణేష్, ఎస్. రమాదేవి, శ్రీనివాసరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో సాగుకు జీవం...



పూసపాటిరేగలో సాగులో ఉన్న వరి

- జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

**పూసపాటిరేగ:** జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో ఖరీఫ్‌లో వరి, తదితర పంటలు సాగు చేస్తున్న రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. ఆగస్టు నెలలో వర్షాల్లేక సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్న తరుణంలో సెప్టెంబర్ ప్రారంభం నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పంటలకు జీవం వచ్చింది. ప్రస్తుతం వరి, మొక్కజొన్న కళకళలాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల హెక్టార్లలో వరి.. 20 వేల హెక్టార్లలో మొక్కజొన్న పంటలు సాగవుతున్నాయి. పూసపాటిరేగ మండల పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి.. నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉంది. విజయనగరం డివిజన్ పరిధిలో వారం రోజులుగా 90 మిల్లీమీటర్ల వరకు వర్షం పడినట్లు అధికారులు తెలిపారు.

**అందుబాటులో ఎరువులు**

వర్షాలు జోరుగా కురవడంతో పంటలపై రైతులు ఆశలు పెంచుకున్నారు. పంటలకు అవసరమైన ఎరువులు రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో రైతులు అవసరమైన ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. యూరియా, పొటాష్ అధికంగా వినియోగిస్తున్నారు.

#### ఏపుగా పైరు..



వరి, మొక్కజొన్న పంటలు వర్షాలకు ఏపుగా పెరుగుతున్నాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలు పంటలు ఏపుగా పెరగడానికి దోహదపడ్డాయి. ఆగస్టు నెలలో వర్షాల్లేకపోవడంతో సాగుకు కొంత ఇబ్బంది కలిగింది. ఈ నెలాఖరు వరకు వర్షాలు పడే అవకాశం ఉండడంతో సాగునీటికి ఇబ్బంది ఉండకపోవచ్చు.

– గుజ్జు సురేష్‌రెడ్డి, రైతు, కుమిలి

#### అధిక వినియోగం తగదు..



అధికంగా ఎరువుల వినియోగంచకూడదు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తే కొత్తరకం తెగుళ్లతో పాటు భూసారం తగ్గుతుంది. ఎరువుల వాడకంపై రైతుభరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులతో చర్చించి, వారు సూచించిన ఎరువులు వినియోగించాలి.

– కె.నీలిమ, మండల వ్యవసాయాధికారి పూసపాటిరేగ

# చంద్రబాబు అవినీతిని దర్యాప్తు సంస్థలే వెలికితీశాయి..

- ఈ విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రమేయం లేదు
- రాజకీయంగా లబ్ధి పొందేందుకే టీడీపీ రాద్ధాంతం
- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

**నెల్లిమర్ల రూరల్:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం రూ. 371 కోట్ల అవినీతి జరిగినట్లు దర్యాప్తు సంస్థలే వెలికి తీశాయని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని మొయిదలో గల ఆయన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబు కేసు వెనుక వైఎస్సార్ సీపీ ప్రమేయం లేదన్నారు. తప్పును కప్పి పుచ్చుకోవడానికి టీడీపీ శ్రేణులు లేనిపోని విమర్శలు చేస్తూ కల్లోలం సృష్టిస్తున్నారన్నారు. జీఎస్టీ, ఇంటిలిజెన్స్, ఐటీ, సెబీ, తదితర దర్యాప్తు ఏజెన్సీలు గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జీఓను విడుదల చేసి అవినీతి సొమ్మును దోచుకునేందుకు చంద్రబాబు కుట్ర పన్నారని ఆరోపించారు. భారీ మొత్తాన్ని విదేశాలకు తరలించి అక్కడి నుంచి 70 షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు లబ్ధి పొందారన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో బాబు మించిన వారు ఎవరూ లేరని.. కేసు నుంచి తప్పించుకోవడానికి ఎన్ని అడ్డదారులు తొక్కారో ప్రజలు చూశారని చెప్పారు. ఇంటికో జాబు వస్తుందని యువతను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. నిజాయితీపరుడునని సభల్లో ఊదర గొడుతున్న చంద్రబాబు నిబంధనలకు విరుద్ధంగా జీఓ ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. డబ్బు విడుదలపై ఆర్థిక శాఖ అధికారులు కొర్రీలు పెడితే, నిధులు విడుదల చేయమని చంద్రబాబు ఎందుకు ఆదేశాలు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని... తప్పు చేసిన వాడికి శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ అట్టాడ శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధి దవళ లక్ష్మణరావు పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ ప్రచారయాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

**విజయనగరం ఫూల్‌బాగ్:** యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచారయాత్రను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జేఆర్‌సీ పట్నాయక్ అధ్యక్షతన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ, 2024 నాటికి యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికానున్న కారణంగా స్వర్ణోత్సవ ప్రచారయాత్రను ఈ నెల 21 నుంచి 29 వరకు ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, గణపతినగరం, విజయనగరంలో పతాకావిష్కరణ, పోస్టర్ల ఆవిష్కరణ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, పి. వాసు, వి. ప్రసన్నకుమార్, ఎం. కేశవరావు, పి. వాసుదేవరావు, డి. రాము, కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు

**జామి:** మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను ఈనెల 12వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎం.జయశ్రీ, మండల కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. బాలురు, బాలికలకు అండర్–14, అండర్–17 విభాగాల్లో అలమండ,కుమరాం ఉన్నత పాఠశాలలు వేదికగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, త్రో బాల్, బాడ్మింటన్, టెన్నీకాయిట్, యోగా, అథ్లెటిక్ పోటీలు ఉంటాయని చెప్పారు.

# పల్లె ఆరోగ్యానికి భరోసా..

- గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్య సేవలు
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



సవరవిల్లి పంచాయతీలో ప్రారంభమైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

**భోగాపురం:** గతంలో మెరుగైన వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి. ఆర్థిక స్థోమత లేనివారు చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యరంగానికి పెద్దపీట వేసింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 108, 104 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు ప్రజలకు చికిత్సలు అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఆస్పత్రికి వెళ్లలేని రోగుల ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. నియోజకవర్గంలో నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాలున్నాయి. ఈ మండలాలలో 40 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మిస్తున్నారు. వీటిలో 70 శాతం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు మొదటగా రూ.17.50 లక్షలు ప్రభుత్వం కేటాయించగా, పెరిగిన ముడిసరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో రూ.3 లక్షలు పెంచారు. ప్రస్తుతం వీటి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. భోగాపురం మండలం సవరవిల్లి, పూసపాటిరేగ మండలం కొప్పెర్ల, కోనాడ, కుమిలి, నెల్లిమర్ల మండలం విజయరాంపురం, సీతారామునిపేట, డెంకాడ మండలం పెదతాడివాడ గ్రామాలలో భవనాలు ప్రారంభించి సేవలు పూర్తి స్థాయిలో అందిస్తున్నారు. మిగిలిన చోట్ల అందుబాటులో ఉన్న భవనాలలోనే వైద్య సేవలు అందిస్తున్నారు.

**2500 మందికి ఒక సెంటర్**

ప్రతి 2500 మంది జనాభాకు ఒక హెల్త్ సెంటర్ చొప్పున నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. హెల్త్ సెంటర్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ ఉండి సేవలందిస్తారు.

**నియోజకవర్గంలో ఇలా**

నెల్లిమర్లకు 14 వైఎస్సార్ విలేజ్‌క్లినిక్‌లు మంజూరు కాగా మూడు పూర్తయ్యాయి. మిగిలినవి తుది దశల్లో ఉన్నాయి. డెంకాడ మండలంలో 13 వైఎస్సార్ విలేజ్‌క్లినిక్‌లకు గానూ నాలుగు భవనాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పూసపాటిరేగ మండలంలో 22 భవనాలకు 7 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. భోగాపురం మండలానికి 14 విలేజ్‌క్లినిక్‌లు మంజూరు కాగా నాలుగు పూర్తికాగా.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

**ఇంటి వద్దకే వైద్యం**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్యం అందుతోంది. ప్రతి గ్రామాన్ని నెలలో రెండు సార్లు వైద్యులు, సిబ్బంది సందర్శించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ చూస్తున్నారు. ఆ తర్వాత మంచంపై ఉన్నవారు, నడవలేని స్థితిలో ఉన్న ఇతర వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య స్థితిగతులు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.

#### ప్రణాళిక ప్రకారం శిబిరాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి రెండు సార్లు 104 వాహనంతో వెళ్తున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఓపీ చూస్తున్నాం. తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేస్తున్నాం. 68 రకాల మందులు విలేజ్ హెల్త్‌కినిక్‌లో అందుబాటులో ఉంటున్నాయి. రోజు అన్ని హెల్త్‌క్లినిక్‌ల నుంచి సమాచారం తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– తిరుపతిస్వామినాయుడు, మండల వైద్యాధికారి, పోలిపల్లి పీహెచ్‌సీ

#### ప్రతి నెలా మందులు ఇస్తున్నారు



నాకు పక్షవాతం వచ్చింది. నేను బయట తిరగలేను. వైద్యం కోసం గతంలో పట్టణాల్లోని పెద్దాస్పత్రులకు వెళ్లి చికిత్సలు తీసుకునేదాన్ని. ప్రస్తుతం వైద్యులు ఇంటి వద్దకే వస్తున్నారు. అవసరమైతే రక్తపరీక్షలు చేస్తున్నారు. వెంటనే మందులు ఇస్తున్నారు. నెలకు రెండు సార్లు వచ్చి సరిపడా మందులు ఇస్తున్నారు.

– సింగిడి కనకరాజు, భోగాపురం

#### గ్రామంలోనే వైద్య సేవలు



మా గ్రామంలో ప్రభుత్వం విలేజ్ హెల్త్‌క్లినిక్ ఏర్పాటు చేసింది. దీంతో మాకు ఏ అత్యవసర వైద్యం, సమస్యలు వచ్చినా హెల్త్ క్లినిక్‌లోని వైద్య సిబ్బంది వెంటనే సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి నెలా రెండుసార్లు 104 వాహనం ద్వారా వైద్యులు గ్రామంలోకి వస్తున్నారు. అక్కడే రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తున్నారు. అత్యవసరం అయినప్పుడు 108 వాహనంలో పట్టణాలకు తీసుకెళ్తున్నారు.

– ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, సర్పంచ్ సవరవిల్లి పంచాయితీ, భోగాపురం మండలం

# మొక్కలే జీవనాధారం



మొక్కల పంపిణీ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

- శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు

**విజయనగరం:** మానవాళి మనగడకు మొక్కలే ప్రాణాధారమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలని శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్ద గల నడక మైదానంలో క్లబ్ సభ్యులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ పర్యావరణ పరి రక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, ప్రధానకార్యదర్శి కోట్ల సత్యనారాయణ, కోశాధికారి జి. గోవిందరావు, జాలీవాకర్ గోవింద్, క్లబ్ పెద్దలు పైడయ్య, వల్లూరి శ్రీనివాసరావు, తాడ్డి ఆదినారాయణ, ఆర్ సీహెచ్ అప్పలనాయుడు, పెనుమత్స అప్పలరాజు, జనార్ధన్ మాస్టారు, ఐవీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పల్లకీ సేవలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్ కౌశిక్, తదితరులు

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- పురవీధుల్లో భారీ ఊరేగింపు



చిన్నారుల కోలాటం

**విజయనగరం టౌన్:** శ్రీకృష్ణ నిజతత్వం తెలుసుకోవడమే ముక్తికి సోపానమని వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ ఈశ్వర్‌కౌశిక్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురజాడ కళావేదికలో ఐదు రోజుల పాటు జరిగిన సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈశ్వర్ కౌశిక్, కేసలి అప్పారావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని సూచించారు. శ్రీకృష్ణుడు అందరి వాడని, ఆయన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సీవీఎస్ నాయుడు, రాజేష్, ప్రసాద్, ఆదినారాయణ, సూరిబాబు, రాజేష్, కోటి, వెంకటేష్, భానుమతి, ప్రమీల, ఆదిలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు

## రోటరీ కబడ్డీ పోటీలకు స్పందన



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో క్లబ్ ప్రతినిధులు

**విజయనగరం:** రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో 35 జట్లకు చెందిన 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను యువజన మాసోత్సవ చైర్మన్ శంకర్ రెడ్డి, డైరెక్టర్ బలభద్రుని అశోక్‌లు ప్రారంభించగా... ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. యువతలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది యుజవన మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మాసోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉడత్తు రాజేష్, కార్యదర్శి అరుణ్, సంజయ్, కొల్లా మనోజ్, తదితరులు పాల్గొన్నారు.